ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 18 జూన్ 2024 | 5





వరుణదేవా.. కరుణలేదా!

- ఊరించి..ఉసూరుమనిపించిన వానలు
- ఉక్కబోత తట్టుకోలేక తల్లడిల్లుతున్న జనం
- రాజమహేంద్రవరంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 17 : అవిగో రుతుపవనాలు వచ్చేశాయి ... ఇక వర్షాలే వర్షాలు.. భూమి చల్లబడినట్టే అంటూ జరుగుతున్న ఊకదంపుడు ప్రచారం ఎండమావిని తలపిస్తున్నాయి. ప్రతిరోజూ తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ రాజమహేంద్రవరం ప్రజలు కళ్లు కాయలు కాసేలా ఆకాశంవైపు ఎదురు చూస్తున్నా ఒక్క వానచినుకు రాలడంలేదు. భూమి చల్లబడడంలేదు. దీంతో రాజమహేంద్రవరం సిటీ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన ఉష్ణోగ్రతలు, ఉక్కబోతతో తల్లడిల్లిపోతున్నారు. గత కొద్దిరోజులుగా ఇదే తరహా మబ్బు వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. సోమవారం కూడా ఇలాంటి వాతావరణ అనుభవాన్నే ప్రజలు చవిచూశారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. గాలి దుమ్ము రేగింది. ఇదంతా కేవలం పది, పదిహేను నిమిషాలకే పరిమితమైంది. ఆ తర్వాత వాతావరణం మళ్లీ మామూలుగా మారిపోయింది. కాస్త ఉక్కబోత తగ్గినా వేడిమాత్రం చల్లారలేదు. గుబులు రేపుతోంది.. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వ్యాపారులు దుకాణాలు మూసివేస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా ఒక మోస్తరు వర్షం కురిసినా రాజమహేంద్రవరం నగరంలో మాత్రం ఒక్క వానచుక్క కూడా పడడంలేదు. దీంతో నగరవాసులు రోజంతా వేడి వాతావరణంలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాత్రి సమయంలోనూ వాతావరణం చల్లబడకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో ఏసీలకు పనిచెబుతున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు,వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఉక్కబోతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. రాబోయే రోజుల్లోనూ వాతావరణ పరిస్థితులు ఇలానే కొనసాగితే ఎలా అంటూ ప్రజలు భయపడుతున్నారు.


కొవ్వూరులో వానకు తడిచిన రోడ్డు

మండలాల్లో మోస్తరుగా..

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: జిల్లాలో గడచిన 36 గంటల్లో అత్యధికంగా కోరుకొండ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ శాఖ తెలియజేసింది. జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కోరుకొండలో 40.0 మి.మీ, అత్యల్పంగా కొవ్వూరు డివిజన్ నిడదవోలులో 1.0 మిమీ వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం డివిజన్ అనపర్తిలో 4.2 మిమీ, గోకవరంలో 1.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 2.6 మి.మీ, సీతానగరంలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కోరుకొండ మండలంలో పిడుగులు పడి రెండు చూడిగేదెలు మరణించాయి..మిగిలిన మండలాల్లో వాతావరణం పొడిగాను, మబ్బుగాను ఉంది. కొవ్వూరు డివిజన్‌లో చాగల్లులో 23.6 మి.మీ, దేవరపల్లిలో 15.8 మి.మీ, గోపాలపురంలో 33.6 మి.మీ, కొవ్వూరులో 15.2 మి.మీ, నల్లజర్లలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పోలవరం చూసి.. కలవరం


దయాఫ్రం వాల్‌ను పరిశీలిస్తున్న బాబు
వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టు పరిశీలిస్తున్న చంద్రబాబు

- పోలవరాన చంద్రబాబు పర్యటన
- గంటన్నర సేపు అణువణువు పరిశీలన
- ఎండలోనే కలియతిరిగిన వైనం
- నిర్మాణంపై అధికారుల నుంచి ఆరా
- ప్రాజెక్టు ప్రాంతం చూసి ఆవేదన
- జగన్ పాలనలో ధ్వంసం
- మళ్లీ మొదటికొచ్చిందని బాధ
- ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి

రాజమహేంద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కళ తప్పిన పోలవరం ప్రాజెక్టు పనులు చూసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివ్వెరపోయారు. 2019కు ముందు సీఎంగా చంద్రబాబు వచ్చినప్పుడు నిత్యం పనులు జరుగుతుండేవి.. ప్రాజెక్టు ప్రాంతం యంత్రాలు.. భారీ వాహనాలతో కళకళలాడేది.. ఎటు చూసినా వేలాది మంది కార్మికులు పని చేసేవారు. ప్రాజెక్టు చూడడానికి వేలాదిగా ప్రజలు వచ్చేవారు.. నాడు పోలవరం ప్రాజెక్టు ఒక పర్యాటక ప్రాంతంగా మారిందనడంలో ఎంత మాత్రం అతిశయోక్తిలేదు. ప్రతి ఒక్కరి నోటా పోలవరం ఎంత వరకూ వచ్చిందో అనే మాట వినిపించేది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇది ధ్వంసమైంది. యంత్రాలు లేవు. ఏదో కొద్ది లారీలతో ఇసుక తరలింపు తప్ప ఇంకేమీ పనులు సాగకపోవడంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆశ్చర్యపోయారు..నా మానసపుత్రిక పోలవరం ఇలా ఉండేమిటో అని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలస్థితిలో ఉన్న ప్రాజెక్టును చూసి నివ్వెరపోయారు.

అణువణువు పరిశీలన..

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు తొలిపర్యటనగా పోలవరం సందర్శించారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు హయాంలో సోమవారం..పోలవారం.. అంటూ ప్రతి వారం పర్యటిస్తూ పనులు పరుగులు పెట్టించారు. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలవడంతో వైసీపీ చేతిక పగ్గాలు వచ్చాయి. అయితే జగన్ మాత్రం పోలవరం ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో 72 శాతం పనులు పూర్తవ్వగా నేడు అదే స్థితిలో ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం కావడంతో సోమవారం.. పోలవారంగా మార్చారు. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి నేరుగా కార్వాన్ బస్‌లో స్పిల్‌వే మీదకు వచ్చారు. స్పిల్‌వే బ్లాక్ 26వ వద్ద పనుల ప్రగతిపై అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరావు, ఇతర అధికారులు అక్కడి పరిస్థితిని వివరించారు. చంద్రబాబు అధికారులను కొన్ని ప్రశ్నలు వేయడంతో పాటు కొన్ని సూచనలు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఫొటోలను పరిశీలించి ఆరా తీశారు. ఒంటి గంటకు గైడ్‌బండ్ గ్యాప్-3, యుఎస్‌సీడీ, గ్యాప్ -1,2, డీఎస్‌ఈడీ వద్ద బస్ దిగి పరిశీలించి, ఇరిగేషన్ ఇంజనీర్ల నుంచి పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఎగువ కాఫర్‌డ్యామ్‌కు చేరుకుని సీపేజీల గురించి ప్రశ్నించారు. పవర్‌హౌస్ దిగువ భాగం నుంచి డయాఫ్రంవాల్ నిర్మించిన ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అధిక వర్షాలకు నాలుగుచోట్ల దెబ్బతిన్నట్టు అధికారులు వివరించారు. అక్కడ దిగువ కాఫర్ సమీపంలోకి వచ్చి వాటిని పరిశీలించి పవర్ హౌస్ పనులు చూసి సుమారు 2 గంటల ప్రాంతానికి తిరిగి పోలవరం స్పిల్‌వే ఎగువభాగంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయన వెంట ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత,మంత్రులు కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప,మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,బత్తుల బలరామకృష్ణ, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మ రాజు, బొలిశెట్టి శ్రీనివాస్,చిర్రి బాలరాజు, బడేటి చంటి, ఏలూరు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్,ఎస్పీ డి.మేరీ ప్రశాంతి,జేసీ బి.లావణ్య, ఆర్డీవో అద్దయ్య తదితరులు ఉన్నారు.


పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి జవహర్ తదితరులు

పోలవరం ఇక వేగవంతం : దుర్గేష్

నిడదవోలు, జూన్ 17 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారాన్ని పోలవారంగా మార్చుకున్నారని గతంలో కూడా సోమవారం పోలవారంగా మార్చుకుని ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేశారని..అయితే గత ముఖ్యమంత్రి శుక్రవారాన్ని తన వారంగా మార్చుకున్నారని ఇది ఎందుకో అందరికి తెలిసిందే అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌ల సంయుక్త కృషితో పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తారన్నారు.


బాబుకు దుర్గేష్ బత్తుల స్వాగతం

పోలవరాన్ని జగన్ ధ్వంసం చేశాడు : చంద్రబాబు

పోలవరం జీవనాడి.. దీనిని జగన్ ధ్వంసం చేశా డన్నారు.తాను 72 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టును ఎన్ని విధాలా సంక్లిష్టం చేయవచ్చో అన్ని విధాలా చేసి పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ మాదిరిగా ఏజన్సీని మార్చేయడం, కమిటీలు వేసి తప్పులు వెతకడం కంటే ముందు ప్రాజెక్టును ఎలా పూర్తి చేయాలనేది ముఖ్యమన్నారు. జగన్‌కు అవగాహనలేక, మూర్ఖంగా ఉండడం వల్ల గతంలో ఏజెన్సీని మార్చడంతో పాటు రివర్స్ టెండర్ అంటూ ప్రాజెక్టును పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది చైనాలోని త్రీగోర్జెస్ కన్నా అధిక స్థాయిలో నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇక్కడ 194 టీఎంసీల నీరు నిల్వ చేయవచ్చని, 320 టీఎంసీల వరకూ వరదనీటిని వినియోగించు కోవచ్చన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయా ఫ్రంవాల్‌ను నిర్మించామని కానీ 2019, 20లో భారీ వర్షాల కారణంగా నాలుగు చోట్ల దెబ్బతిందన్నారు. దీని మరమ్మతులకు రూ.447 కోట్లు ఖర్చవుతుందని.. పూర్తిగా మరమ్మతులు అవుతాయనే భరోసా లేదన్నారు. ప్రత్యామ్నాయంగా డయాఫ్రంవాల్ నిర్మించడానికి రూ.996 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేసినట్టు చెప్పారు.దీనికి కనీసం నాలుగు సీజన్లు పడుతుందని, 2022కే పూర్తి కావలసిన ప్రాజెక్టు మరింత ఆలస్యమవుతుందన్నారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. ఇవన్నీ చూసి అర్థం చేసుకున్నానని ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.


పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న చంద్రబాబు కాన్వాయ్

సర్కారు సొమ్ముతో షో..కులు!

ఉపాధి నిధులతో ప్రైవేటు లేఅవుట్‌కు రోడ్డు


ఎవరికోసం ఈ రోడ్డు : ఉపాధి నిధులు రూ.3.5 కోట్లతో పిడింగొయ్యిలో ఒక లేఅవుట్‌లో గత పాలకులు వేసిన రోడ్డు

- ఉపాధి నిధులు పక్కదారి
- రూ.3.50 కోట్ల వ్యయం
- నాటి మంత్రి ఆదేశాలతో పనులు?
- పిడింగొయ్యిలో నిర్మాణం
- ఇదీ వైసీపీ పాలకుల దాష్టీకం
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 17 : అంతా మా ఇష్టం..అడిగేదెవడ్రా అంతా మా ఇష్టం.. ఐదేళ్లూ ఇదీ వైసీపీ నాయకుల తీరు.. అధికార పార్టీలో ఒకరో ఇద్దరో తేడాగా ఉంటారు.. అయితే వైసీపీలో మాత్రం అందరూ తేడానే.. దీంతో ఆ పార్టీ అధికారంలో ఉన్నంత సేపూ ఎవరూ మాట్లాడేవారుకాదు.. దీంతో వారిని నచ్చిన చోట.. మెప్పించిన వారి కోసం రోడ్లు వేసేవారు..ఈ కథనమే అందుకు ఉదాహరణ. సాధారణంగా జాతీయ ఉపాధి హామీ నిధులతో ప్రజల సౌకర్యార్థం రోడ్ల నిర్మాణాలు చేపడతారు.ఈ పనుల ద్వారా ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నది పథకం ఆశయం. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో నిబంధనలు అతిక్రమించి కొంతమంది లేఅవుట్‌దారులు, వ్యాపారసంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా జనావాసం లేని ప్రాంతంలో సుమారు రూ.3.50 కోట్ల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. సార్వత్రికఎన్నికల ముందు మండలంలో రూ.100 కోట్ల నిధులతో రోడ్లు వేస్తున్నామంటూ జీవో తెచ్చి హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. అయితే ఒక్క పని కూడా ఆరంభించలేదు.లే అవు ట్‌దారులకు తప్ప ఎవరికి ఉపయోగపడని ఈ ఒక్క రోడ్డును మాత్రం హడావుడిగా పూర్తి చేశారు.

ఆ లేఅవుట్‌కి రోడ్డెందుకు?

రూరల్ మండలం పరిధిలో పిడింగొయ్యి, కాతేరు, తొర్రేడు, వెంకటనగరం హుకుంపేట, కాలమూరు, ధవళేశ్వరం, బొమ్మూరు, రాజవోలు తదితర గ్రామాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. అలాంటిది ఇవన్నీ వదిలేసి లేఅవుట్, వ్యాపారస్థులు ఇచ్చే ముడుపులకు కక్కుర్తిపడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ పలువురు విమర్శిస్తున్నారు. అటువంటిది రాజమహేంద్రవ(రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో పిట్టలవారిచెరువు ప్రాంతంలో సుమారు రూ.3.50 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పిట్టలవారి చెరువునుంచి ఎస్ఈఆర్ కుమార్ లేవుట్ వరకు రూ. 50లక్షలు, అక్కడ నుంచి రామకృష్ణ గార్డెన్ వరకు రూ.50 లక్షలు,సూర్యనారాయణ లేఅవుట్ నుంచి పంచికర్ల కృష్ణ లేవుట్ వరకు రూ. 50 లక్షలు, రేలంగి చిన వెంకట్రావు సైట్ నుండి రఘుబాబు సైట్ వరకు అలా బిట్లుగా విభజించి లేవుట్‌కు ఏకంగా సీసీ రోడ్లు నిర్మించారు. ఒక పక్క ప్రజ లం తా నివసించే చాలా గ్రామాల్లో రోడ్లు లేక ఇబ్బం దిపడుతున్న ఘటనలెన్నో ఉన్నాయి.ఒక్కసారి కాతేరు..బొ మ్మూరు, రాజవోలు తదితర గ్రామాలకు వెళితే భారీ భవంతులు ఉంటాయి. రోడ్డే ఉండదు. అయితే ఈ లేఅవుట్‌పై నాయకుల కెందుకంత మోజో వారికే తెలియాలి. ఇదంతా కలెక్టరేట్ చెం తనే జరుగుతున్నా చూసీ చూడనట్టు వదిలేయ డం కొసమెరుపు.ప్రస్తుత రూరల్ ఎమెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి జోక్యం చేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నాటి మంత్రి వేణు ఆదేశాలు..

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తో పాటు జిల్లా ఉన్నతాదికారుల ఆదేశాలతో గ్రామసభలో తీర్మానం చేశాం.అప్పటి గ్రామ ప్రత్యేకాదికారి జానా సత్యనారాయణ సమక్షంలో 2024 ఫిబ్రవరి 1న తీర్మానం చేశాం.
రూప్‌చంద్, పిడింగొయ్యి కార్యదర్శి

అంతా పెద్దోళ్ల వ్యవహారం : ఎంపీడీవో
సంబంధిత రోడ్డు విషయమై రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా అదంతా పెద్ద వాళ్ల వ్యవహారం అంటూ తప్పించుకుంటున్నారు. డ్వామా పీడీ ముఖలింగం వివరణకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


రాజమండ్రి నమూనా రైల్వేస్టేషన్


రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణపై సమీక్ష

రాజమహేంద్రవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌ను రూ.250 కోట్ల అంచనా వ్యయంతో తీర్చిదిద్దనున్నట్టు రైల్వే శాఖ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు రీ-డవలప్‌మెంట్‌పై అధికారులతో సోమవారం సమీక్షించారు.అమృత్ భారత్‌లో భాగంగా అత్యాధునికంగా తీర్చిదిద్దే రైల్వేస్టేషన్ల జాబితాలో రాజమండ్రి కూడా ఉండడం తెలి సిందే.ఈ స్టేషన్‌ని రానున్న 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంచనాలు సిద్ధం చేశా రు. మెట్రో సిటీల్లో ఎయిర్‌పోర్టుల మాదిరిగా రైల్వే స్టేషన్ రూపు దిద్దుకోబోతోంది. వీటన్నిటిపై ఉన్నతాధికారులతో రైల్వే కేంద్ర మంత్రి చర్చించారు. దీంతో పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. రాజమండ్రి రైల్వేస్టేషన్ గతేడాది జూలై నెలలో ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకొంది. ప్రస్తుతం ప్రతి రోజూ 100 వరకూ రైళ్లు నడుస్తుండగా..10 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.

నేడు పీఎం కిసాన్ విడుదల

రూ.2 వేలు చొప్పున బ్యాంకుల్లో జమ

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 17: పీఎం కిసాన్ పథకం నిధులు మంగళవారం ప్రధానీ నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు.ఉత్తరప్రదేశ్‌లోని వారణసిలో మంగళవారం జరిగే కిసాన్ సమ్మేళన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 9.3 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ పథకం 17వ విడత విడుదల చేస్తారన్నారు. జిల్లాలో 98,550 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున రూ.19.71 కోట్లు జమవుతాయన్నారు. రైతుల్లో ఈ పథకంపై అవగాహనకు జిల్లావ్యాప్తంగాసాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.దీని కోసం హెచ్‌టీటీపీఎస్://పీఎంఐఎన్‌డీఐఎవెబ్‌కాస్ట్.ఎన్ఐసీ.ఇన్/లో తిలకించవచ్చన్నారు. జిల్లాలో 107 ప్యాక్ సొసైటీల్లో ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



భక్తిగా..బక్రీద్

ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.. సోమవారం ఉదయమే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.. జిల్లాలో రాజమహేంద్రవరం, నిడదవోలు , కొవ్వూరు, ఉండ్రాజవరం, పెరవలి తదితర మండలాల్లో ముస్లింలు పండుగను జరుపుకున్నారు. నిడదవోలులోని ఒక మసీదులో సోమవారం మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రార్ధనల్లో పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీకగా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది..మసీదులన్నీ ముస్లిం సోదరులతో కిటకిటలాడాయి.

కల్యాణం.. కమనీయం

వైనతేయ నదీ తీరం భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగింది. అప్పనపల్లి బాలబాలాజీస్వామి దివ్య కళ్యాణాన్ని పాంచాహ్నిహ్నిక దీక్షతో పాంచరాత్ర ఆగమానుసారం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన సోమవారం రాత్రి 8.59 గంటలకు వేద మంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు.



కల్యాణ తంతును నిర్వహిస్తున్న పండితులు



కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు

మామిడికుదురు, జూన్ 17:చినజీయర్‌స్వామి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్, అర్చకులు ఎదుర్కోలు సన్నాహంలో భాగంగా స్వామివారి గుణగణాలను వివరించిన తీరు భక్తుల మనసులను రంజింపచేసింది. కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించగా 315 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. వారికి దేవస్థానం సిబ్బంది తాగునీరు, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు వీలుగా ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనరు గ్రంధి మాధవి పర్యవేక్షణలో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



సీతారామ్

అంబాజీపేట, జూన్ 17: టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు తణుకుకు చెందిన వారణాసి సీతారామ్ (53), అతని భార్య మహాలక్ష్మి, కుమార్తె లాస్యశ్రీ మోటారు సైకిల్‌పై ఈ నెల 16న అమలాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముక్కామల సమీపంలోకి వచ్చేసరికి రావులపాలెం నుంచి అమలాపురం వైపు వెళ్తున్న టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సీతారామ్ చికిత్స పొందుతూ మృతి చెందగా మహాలక్ష్మి చికిత్స పొందుతోంది. లాస్యశ్రీ కుడికాలును తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు.

బాలికపై అత్యాచారం

మలికిపురం, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలోని ఒక గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికను 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారం చేశాడు. తొమ్మిది సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 55 సంవత్సరాల వై.సంపదరావు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నెల 12వ తేదీన ఈ సంఘటన జరగ్గా బాలిక తండ్రి ఈ నెల 16న ఆదివారం రాత్రి మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజోలు సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు. సంఘటనా స్థలాన్ని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ సోమవారం సాయంత్రం పరిశీలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

పిఠాపురం రూరల్, జూన్ 17: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ సోమవారం వెల్లడించారు. భోగాపురం గ్రామంలోని ఆలయం వద్ద నిద్రిస్తున్న బొమ్మదేవు ప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన నాగులాపల్లి పద్మరాజు నాపరాయితో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు కోసం కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. ప్రసాద్, పద్మరాజులు ఇద్దరు కాకినాడ గాంధీనగర్‌లోని ఒక మేస్త్రి వద్ద 15 రోజులుగా పనిచేస్తున్నారు. 13వ తేదీన చేసిన పనికి సంబంధించి ప్రసాద్ మేస్త్రిని డబ్బులు అడగగా, పద్మరాజు తీసుకువెళ్లినట్లు చెప్పాడు. దీనిపై అదే రోజు రాత్రి ఇద్దరి మధ్య వివాదం జరిగింది. తనను చంపుతామని బెదిరించడంతో పద్మరాజు అదే రోజు రాత్రి నిద్రిస్తున్న ప్రసాద్‌ను రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు ముందు అంగీకరించాడు. పద్మరాజును బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

ప్రయాణికులు సురక్షితం



ఆత్రేయపురం, జూన్ 17: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఒక కుటుంబం కారులో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వచ్చింది. దర్శనం అనంతరం తిరిగి వెళ్తుండగా లొల్ల-నల్లకాల్వ సమీపంలో కారు ప్రమాదవశాత్తు అదుపు తప్పి పంటకాల్వలోకి దూసుకెళ్లింది. స్థానికులు కారును బయటకు తీశారు. అందులో ఉన్నవారంతా సురక్షితంగా బయటపడ్డారు.

మరో పది డయేరియా కేసులు

బాధితులను పరామర్శించిన వైద్య శాఖ ఉన్నతాధికారులు

కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు



పరామర్శిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో నర్సింహనాయక్

తొండంగి,జూన్ 17:తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో సోమవారం మరో 10 డయేరియా కేసులు నమోదయ్యాయి.ఆదివారం కొంత నెమ్మదించినప్పటికి తిరిగి పది కేసులు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నర్సింహనాయక్ గ్రామాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.గత కొద్ది రోజులుగా ఆయన ప్రతి రోజు గ్రామాన్ని సందర్శించి తగిన సూచనలు జారీ చేస్తున్నారు.ఇప్పటి వరకూ సుమారు వంద కేసుల వరకూ నమోదు కావడంతో శాసన.మండలి ప్రతి పక్షనేత యనమల రామకృష్ణుడు,స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్యలు ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసారు.దీంతో జిల్లా అధికారులంతా ప్రతి రోజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారి భారతీ సౌజన్య ,డిఎల్‌పిఓ బాలామణిలు గ్రామంలో జరుగుతున్న పారిశుద్య కార్యక్రమాలను పరిశీలించి తగిన సూచనలు జారీ చేసారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన పారిశుద్య సిబ్బంది గ్రామమంతా శుభ్రపరచి బ్లీచింగ్ చల్లి క్రిమి సంహారక మందులు పిచికారీ చేసారు.తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.గ్రామస్తుల సూచన మేరకు వాటర్ పైప్‌లైన్ కు సంబంధించిన గేట్ వాల్వు ఉన్న ప్రాంతంలో సిమ్మెంట్ రహదారి నిర్మించడంతో దానిని పరిశీలించేదుక అక్కడ తవ్వించారు.స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న రోగుల్ని జిల్లా వైద్యాధికారి నర్సింహనాయక్ జిల్లా ఉపవైద్యాధికారి సరితలు పరామర్శించారు.తగు జాగ్రత్తలు తీసుకోవాలని ,కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతిలు వైద్యసేవలు అందిస్తున్నారు.మండల టిడిపి నేత యనమల రాజేష్ మాట్లాడుతూ రోగులంతా ధైర్యంగా ఉండాలన్నారు,యనమల రామకృష్ణుడు జిల్లా అధికారులను రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారని.ప్రభుత్వం అన్ని విధాలా రోగులకు అండగా ఉంటుందన్నారు.ఎవరూ ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు.ఎంపిడిఓ మల్లేశ్వరావు, తదితరులు పారిశుధ్యపనులు పర్యవేక్షించారు.

పలు రకాలుగా మోసాలు

- రూ.కోటికి పైగా కాజేసిన వ్యక్తి?
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఆలమూరు, జూన్ 17: దివ్యాంగుడు..అనగానే ఎదుటివారు జాలి, దయ చూపిస్తారు. కానీ దానినే పెట్టుబడిగా ఈ దివ్యాంగుడు పలువురిని అనేక రకాలుగా బుట్టలో వేసుకుని వారి వద్ద నుంచి రూ.కోటికి పైగా లాగేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో జరిగిన ఈ ఘటనలో అనేక విషయాలు బయటపడుతున్నాయి. సదరు దివ్యాంగుడిపై బాధితులు ఆలమూరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.... ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన యర్రంశెట్టి దుర్గారావు అనే దివ్యాంగుడు పెళ్లిళ్ల మధ్యవర్తిగా వ్యవహరిస్తూ అనేక మందిని మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అతడు తల్లి వెంకయమ్మ, తమ్ముడు మురళి సహాయ సహకారాలతో ఈ నేరాలకు పాల్పడినట్టు బాధితులు చెప్తున్నారు. మూలస్థానం గ్రామానికి చెందిన డి.రాంబాబు కుమారుడికి చాగల్నాడు నుంచి నాలుగు ఎకరాలు కట్నం ఇస్తారని పెళ్లి సంబంధం తీసుకొచ్చాడు. పెళ్లి కుదిర్చేందుకు పావులు కదిపాడు. పెళ్లి కుమార్తె తరఫు వారు ఇబ్బందుల్లో ఉన్నారని నమ్మించి పలు దఫాలుగా బంగారంతో పాటు దాదాపు రూ.40 లక్షల వరకు నగదు కాజేసినట్టు బాధితులు వివరించారు. నవాబుపేటలో పాల వ్యాపారం చేసుకునే సురేష్ వద్దకు వచ్చి స్నేహం చేశాడు. కొద్దిరోజుల తర్వాత తన బంగారాన్ని బ్యాంకులో కుదువపెట్టానని, అది వేలానికి వచ్చిందని దుర్గారావు చెప్పాడు. తాను విడిపించుకోలేనని రూ.4.10 లక్షలు చెల్లిస్తే దాదాపు రూ.10 లక్షల విలువ గల బంగారం తీసేసుకోవచ్చని నమ్మబలికి ఆ మొత్తాన్ని తీసుకున్నట్టు బాధితుడు సురేష్ చెప్పాడు. రావులపాలెంలో ఒక ఫైనాన్స్ కంపెనీ యాజమాని వద్ద ఇదే చెప్పి దాదాపు రూ.10 లక్షలు కాజేసిన వ్యవహారం కూడా వెలుగు చూసింది. దుర్గారావు ఆలమూరు, కడియం, రావులపాలెంల్లో అనేక మోసాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. అతడిపై ఆలమూరు పోలీస్ స్టేషన్లో ఇప్పటివరకు ఆరు ఫిర్యాదులు అందాయి.

సిలిండర్ పేలి తాటాకు పాక దగ్ధం

రూ. 7 లక్షల ఆస్తి నష్టం



గొల్లప్రోలు రూరల్, జూన్ 17: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి తాటాకుపాక దగ్ధమవడంతో రూ. 7 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన పోలవరపు చంద్రరావు కూలి పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటారు. సోమవారం పనులు నిమిత్తం బయటకు వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లతో పాటు 7 కాసుల బంగారం నగలు, చీటి పాడి ఇంటిలో తెచ్చి పెట్టిన నగదు, బీరువాలు, బట్టలు, ఇతర నిత్యావసర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంతో రోడ్డున పడ్డామని చంద్రరావు, అతని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. మంటలు పక్కనే ఉన్న షేక్ రాజుబాబు ఇంటికి వ్యాపించడంతో అతని ఇంటికి ఉన్న ఏసీ, గదిలో ఉన్న మంచం, ఇతర సామాన్లు కాలిపోయాయి. ప్రమాదంలో ఆస్తినష్టం రూ.7 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికే స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు మరింతగా వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పదివేల కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం

గొల్లప్రోలు, జూన్ 16: జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలతో పాటు పర్యావరణ శాఖా మంత్రిగా ఈ నెల 19వ తేదీన బాధ్యతలు స్వీకరిస్తున్న వేళ ఒక జనసేన నేత వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజున ప్రారంభించి పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాజెక్టు రైజ్ కోకో పేరుతో పదివేల కొబ్బరిమొక్కలు నాటే కార్యక్రమానికి జనసేన నేత మురాలశెట్టి సునీల్‌కుమార్ శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చల్లా లక్ష్మి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, మారిశెట్టి బుజ్జి, బాపన్నదొర, సానా నాగు, కండేపల్లి నూకరాజు, గంధం నాగేంద్ర, రావు రాజేష్ పాల్గొన్నారు.



వ్రతమాచరిస్తున్న భక్తులు

సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

అన్నవరం, జూన్ 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి సోమవారం భక్తులతో పోటెత్తింది. ఏకాదశి పర్వదినం, బక్రీదు సెలవు దినం కావడంతో ఈ రద్దీ నెలకొంది. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు సుమారు 4500 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.55 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఆలయ అధికారులు వివిధ ఏర్పాట్లు చేశారు.

విజయనగరం ఎంపీ పూజలు



పూజలు చేస్తున్న అప్పలనాయుడు

అన్నవరం, జూన్ 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి సోమవారం విజయనగరం ఎంపీగా ఎన్నికైన కలిశెట్టి అప్పలనాయుడు మొక్కులు చెల్లించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తానని అప్పలనాయుడు అనుకున్నారు. అయితే వీటిని సోమవారం తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రులకు ఉపయోగపడే పోలవరం, అమరావతి రాజధాని చంద్రబాబు హయాంలో త్వరితగతిన పూర్తికావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో ఎం.గణపతి తదితరులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.

12 కిలోల వాలుగ చేప



కొత్తపేట, జూన్ 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ గ్రామంలో ఓ రైతుకు పంట చేలో పెద్ద వాలుగ చేప దొరికింది. కండ్రిగకు చెందిన రైతు బొక్కా రామమూర్తి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి చేలో నీరు పెట్టడానికి పొలానికి వెళ్లాడు. తన చేలో పెద్ద చేప అటూఇటూ తిరుగుతుండడం చూసి ఆశ్చర్యానికి గురయ్యాడు. దానిని పట్టుకుని పైకి తీశాడు. సుమారు మూడు అడుగుల పొడవు 12 కిలోల బరువున్న ఈ చేప పంట చేలో దొరకడంపై సమీప రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే పంట కాల్వలో మూడు లేదా నాలుగు కిలోలకు మించి వాలుగులు దొరకవు. ఇంత పెద్ద చేప దొరకడంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు.

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 17: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ర్యాలికి చెందిన కోడాటి రవికిశోర్-వెంకటరత్నకుమారి దంపతులు రూ.1,00,008 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.4,51,958 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

భీమేశ్వరునికి పూజలు



సామర్లకోట, జూన్ 17: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో 18 రోజుల పాటు భారతీయ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శివలింగ జీర్ణోద్ధారణ ప్రక్రియ పూర్తవడంతో ఏకాదశి సోమవారం తెల్లవారుజాము నుంచి దర్శనాలకు అనుమతించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ తదితరులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు చక్కెరపొంగలి, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాలను మూడు వేల మందికి మజ్జిగను పంపిణీ చేశారు. ఆలయం వెలుపల గల భీమేశ్వర అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



కరప, జూన్ 17: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి గ్రామానికి చెందిన సునంద తేజశ్రీ ఎంపికయ్యింది. కాకినాడలోని అన్నవరం సత్యదేవ మహిళా కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తేజశ్రీ గత మే 31 నుంచి జూన్ 1వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ చింతా నారాయణమూర్తిరాజు తెలిపారు. దీంతో సెలక్టర్లు ఆమెను రాష్ట్రజట్టుకు ఎంపికచేశారని, ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరిగే ఆల్ ఇండియా బాలికల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆడేందుకు సోమవారం బయలుదేరి వెళ్లినట్టు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తేజశ్రీని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, గురజనాపల్లి హైస్కూల్ పీడీ కర్రి నాగ లింగేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



అన్నవరం, జూన్ 17: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన పి. రోజాశ్రీదేవి రూ 1,00,116 విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం ప్రసాదాలు అందజేశారు.

ఏజెన్సీ సమాచారం

లక్ష్మీదేవి అమ్మవారి కొలుపులు



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

ఎటపాక, జూన్ 17: ఎటపాక మండలం, గొమ్ముకొత్తగూడెం గ్రామంలో గత రెండు రోజులుగా లక్ష్మీదేవి అమ్మవారి కొలుపులు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఆదివారం మేళ తాళాల నడుమ పూనకాలతో సంబరాలు నిర్వహించారు. రెండో రోజున సోమవారం అమ్మవారి ఊరేగింపుగా గంగా స్నానానికి గోదావరిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, తదనంతరం వీధుల్లో ఊరేగించి, ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కొలుపులను ఆదివాసీలు ప్రతీ ఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో గ్రామ పూజారి కవులూరి వీరభద్రం, గ్రామ పటేల్ కె.రాజులు, గ్రామస్తులు పూసం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు



మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

మోతుగూడెం,జూన్17:చింతూరు మండలం మోతుగూడెం సోమవారం మార్కెట్లో ఉన్న జామియా మసీదులో బక్రీద్‌ను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు కమిటీ సభ్యులు ఒకరికొకరు బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముస్లింల శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

అడ్డతీగల, జూన్ 17: అడ్డతీగల మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మసీద్ ఆవరణలో మసీద్ అధ్యక్షుడు షేక్ హజారత్ ఆధ్వర్యంలో ఈద్ ముబారక్ చెప్పుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దంగేటి సత్తిబాబు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మసీద్ గురువు అబ్దుల్ రజాక్ శుభాకాంక్షలు తెలిపారు.

విప్పకాయలతో గిరిజనులకు ఉపాధి



ఎండబెట్టిన విప్పకాయలు



మోతుగూడెం,జూన్ 17: మన్యంలో వేసవిలో దొరికే విప్పకాయలతో పలు గిరిజన కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. మన్యం పరిసర ప్రాంతాల్లో ఉండే విప్ప చెట్ల నుంచి ఈ కాయలను గిరిజనులు సేకరిస్తారు. అనంతరం ఈ కాయలను రెండు బద్దలుగా వేరు చేసి ఎండ బెడతారు. ఆ తర్వాత సంత మార్కెట్లో విక్రయిస్తారు. విప్ప బద్దలకు మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఏటా ఉండటంతో మోతుగూడెం మన్యం ప్రాంతంలో ప్రతి గిరిజన కుటుంబం విప్పకాయల సేకరణలో మంచి ఉపాధి పొందడంతో పాటు మంచి ఆదాయాన్ని పొందుతారు. విప్పబద్దలను గానుగ ఆడించి విప్పనూనె తయారు చేస్తారు. ఈ నూనెను పలువురు వంటల్లో వాడతారు. విప్పకాయలకు ముందు ఇదే చెట్టు నుంచి విప్ప పూలనే సేకరిస్తారు. విప్పపూలకు కూడా మంచి డిమాండ్ ఉంది. విప్ప పువ్వులు దేవుడికి నైవేద్యంగా, విప్పసారా తయారీకి వాడతారు.

గొర్రె గేదె మృతి



గేదెను ఖననం చేస్తున్న దృశ్యం

మారేడుమిల్లి,జూన్17: మారేడుమిల్లి కాఫీ తోటల్లో గొర్రెగేదె మృతిచెంది ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. సోమవారం ఉదయం కాఫీ తోటలోని కూలి పనివారు అందించిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించగా గొర్రెగేదె గొయ్యిలో పడి మృతి చెంది ఉండటాన్ని గమనించారు. పశు వైద్యులు సీహెచ్ తరుణ్‌కుమార్ గొర్రె గేదెకు పరీక్షలు నిర్వహిచి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అటవీ అధికారులు సబ్ డివిజనల్ అధికారి కె.శ్రీవాణి, ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ ఎం.కరుణాకర్, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి అరుణ్, సెక్షన్ ఆఫీసర్ కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఖననం చేశారు. దీనిపై కేసు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జలపాతం వద్ద సందర్శకులు

మోతుగూడెం,జూన్17:చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. ఆది, సోమవారాలు సెలవు రావడంతో పర్యాటక ప్రదేశాలు, పిక్నిక్ స్పాట్, సీలేరు నది, ఫోర్ బై రిజర్వాయర్, డొంకరాయి రిజర్వాయర్ ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు.





సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి



పోలవరం సందర్శనకు కాన్వాయ్‌లో సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



చంద్రబాబుకు నమస్కరిస్తున్న బూరుగుపల్లి



క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తున్న సీఎం చంద్రబాబు

కొవ్వూరు/గోపాలపురం/నిడదవోలు, జూన్ 17: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు సోమవారం వచ్చారు. మధ్యాహ్నం సుమారు 12గంటలకు ప్రాజెక్టు వద్దకు వచ్చిన ఆయనకు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అక్కడి నుంచి నేరుగా కార్వాన్‌లో స్పిల్‌వే మీదకు వచ్చారు. డయాఫ్రం వాల్, కాపర్ డ్యాం, తర్వాత 1గంటకు గైడ్‌బండ్ గ్యాప్-3, యూఎస్‌సీడీ, గ్యాప్ -1,2, డీఎస్‌ఈడీ తదితర ప్రాంతాలను పరిశీలించారు. పనుల ప్రగతిపై అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన మొదలై 72శాతం పనులు పూర్తిచేసిన చంద్రబాబే మిగిలిన 28శాతం పూర్తి చేయదగిన నాయకుడని అన్నారు. శేషారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడం చంద్రబాబుతోనే సాధ్యమని, ఇక పనులు వేగవంతం కానున్నాయని అన్నారు.



ప్రాజెక్టు సందర్శనలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ప్రాజెక్టు వద్ద యంత్రాలతో పనిచేస్తున్న దృశ్యం



పోలవరం ప్రాజెక్టు ఏరియా



ప్రాజెక్టు ప్రగతిని మ్యాప్‌ల ద్వారా సీఎంకు వివరిస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛా వాయువులు

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- బీజేపీలో చేరిన కుతుకులూరు సర్పంచ్



సర్పంచ్ హేమతులసి దంపతులను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి జూన్ 17: ఐదేళ్ల పాలనలో అణగదొక్కబడిన బలహీన వర్గాల స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు కూటమి ప్రభుత్వంతో స్వేచ్ఛా వాయువులు వచ్చాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుతుకులూరు వైసీపీ సర్పంచ్ గొల్లు హేమతులసి, సురేష్ దంపతులు బీజేపీలో చేరారు. వారికి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కుతుకులూరు పంచాయతీని ఆయన సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌కు ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లితే క్షమించబోమన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ పదవుల్లో ఉన్న బలహీన వర్గాల వారిని చిన్నచూపు చూశారని, మేజర్ పంచాయతీగా ఉన్న అనపర్తిలో దళిత సర్పంచ్ వారా కుమారికి కుర్చీ లేకుండా చేశారన్నారు. రాజ్యాంగపరంగా పదవులు పొందిన సర్పంచ్‌లను పక్కనపెట్టి ఉప సర్పంచ్‌లు రాజ్యమేలుతున్నారని ఇకమీదట ఇటువంటి సంఘటనలు జరిగితే ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో నాయకులు పులగం సూర్రెడ్డి, కర్రి చిన్నారెడ్డి, నల్లమిల్లి తాతారెడ్డి, తిరుమలరెడ్డి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపు

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నల్లమిల్లి కృషి చేస్తున్నారు. కాలువలు విడిచిపెట్టినా ఖరీఫ్‌లో నారుమడులు వేసుకునేందుకు నీరందని పరిస్థితులను గమనించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఇరిగేషన్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో చర్చించి సోమవారం కాకినాడ కాలువలో అనపర్తి నుంచి సంపర వరకు ఉపాధి కూలీలతో గుర్రపు డెక్క తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించి మరో రెండు రోజులు కష్టపడితే పూర్తిస్థాయిలో డెక్కను తొలగించవచ్చని తద్వారా 34వేల ఎకరాల్లో వరి పంటకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు జడ్పీటీసీ రాంబాబు శుభాకాంక్షలు



రంగంపేట, జూన్ 17: ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని సోమవారం రామవరంలో రంగంపేట జడ్పీటీసీ సభ్యులు పేపకాయల రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీని నాశనం చేశావ్.. రాజీనామా చెయ్

- నగర అధ్యక్షుడు శ్రీహరిపై ఆ పార్టీ నేత బర్రే ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: రాజమహేంద్రవరంలో వైసీపీని నాశనం చేశాడని, పార్టీ నగర అధ్యక్ష పదవి అడపా శ్రీహరిపై అదే పార్టీకి చెందిన బర్రే కొండబాబు ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వైసీపీ వార్డు ఇన్‌చార్జీల సమావేశంలో.. రాజమహేంద్రవరంలో భరత్‌రామ్‌కు 30 వేలు మెజార్టీ రాకపోతే తక్షణమే తాను రాజీనామా చేస్తానని, చాలా గొప్పగా అందరిలో ప్రకటించిన శ్రీహరి నగరంలో వైసీపీ ఓడిపోయినా ఇంతవరకు రాజీనామా చేయలేదన్నారు. అనుభవం లేదు, విలువల్లేవు, ఆచరణలేని వ్యక్తి అడపా శ్రీహరి అని, ఏ వార్డులోనూ ఇన్‌చార్జిలకు పట్టులేకుండా చేశారని ధ్వజమెత్తారు. గతంలో పార్టీ నగర అధ్యక్షులుగా చేసిన వారు పని చేశారని, భ్రష్టు పట్టించలేదన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీని బలోపేతం చేయలేకపోయారు. ఇప్పుడేమి చేయగలని ప్రశ్నించారు. అతను రాజీనామా చేయకపోతే తాము ప్రణాళిక సిద్ధం చేసుకుంటామని కొండబాబు అన్నారు. దీంతో పార్టీలో అంతర్గత పోరు ఒక్కసారిగా బయట పడింది.

మీ సేవ కేంద్రాలకు పూర్వవైభవం తీసుకురండి

ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డిలకు నిర్వాహకుల వినతి



ఎంపీ పురందేశ్వరిని కలిసి సమస్యను విన్నవిస్తున్న మీ సేవ నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: గత వైసీపీ ప్రభుత్వం మీసేవల పట్ల అనుసరించిన విధానాలతో తాము పూర్తిగా నష్టాల్లోకి కూరుకుపోయామని ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో మీసేవ కేంద్రాలు నడపలేని స్థితిలో ఉన్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌లను సోమవారం కలిసి తమ గోడును చెప్పుకున్నారు. మీసేవ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం హయాంలో పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు తప్పక న్యాయం చేస్తామన్నారు.

మందేశ్వరుని దర్శించుకున్న కమిషనర్ దినేష్‌కుమార్



కొత్తపేట, జూన్ 17: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) స్వామిని సోమవారం రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనరు కె.దినేష్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ప్రధానార్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేద పండితులు స్వాగతం పలికి వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కడియం, జూన్ 17: బక్రీద్ పండుగను మండలంలో ఘనంగా నిర్వహించారు. కడియం, దుళ్ల, వేమగిరి, పొట్టిలంక తదితర గ్రామాల మస్‌జిద్‌లలో ఇమామ్‌లు బక్రీద్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో ముస్లింలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడియం, జూన్ 17: కడియపులంక ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం సోమవారం కడియం జీఎస్‌ఆర్ విల్లాలో జరిగింది. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి అల్లరి చేష్టలు, మధుర సంగతులను గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సూర్యకుమారి, రామకృష్ణ, సీహెచ్ సుబ్రహ్మణ్యం, రామచంద్రరావు, విజయదుర్గ, నాగకుమారి, పి.సుబ్రహ్మణ్యం, హసీనాబేగం, సరోజిని, దివాకర్ మాస్టర్‌లను ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు.



బీసీలకుపెద్దపీట వేస్తున్న టీడీపీ

పార్టీ యాదవ సాధికార సమితి జిల్లా కన్వీనర్

దివాన్‌చెరువు, జూన్ 17: రాష్ట్రంలో కీలకమైన పదవులను కేటాయించడంలో సీఎం చంద్రబాబు బీసీలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు) అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్‌లోని 24 మందిలో ఎనిమిది మంత్రి పదవులు బీసీలకు దక్కగా, తాజాగా టీడీపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కుడా వెనుకబడిన తరగతులకు చెందిన పల్లా శ్రీనివాసరావును నియమించారన్నారు. ఎన్నికలకు ముందు బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆమేరకు కీలకపదవులను బీసీలకు కేటాయిస్తున్నారంటూ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1,20,000 కోట్లు కేటాయించాలి

ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు



సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: పోలవరానికి కేంద్ర ప్రభుత్వం లక్షా 20 వేల కోట్లు కేటాయించాలని ఆదివాసీ మహాసభ న్యాయ్యసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం 1,70,000 ఎకరాలకు రూ.36 లక్షలు చొప్పున నష్టపరిహారంగా రూ.61 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఇంకా 93 వేల కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తిచేసిన తర్వాత మాత్రమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులకు ఈమెయిల్ ద్వారా లేఖలు పంపించినట్టు చెప్పారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ అల్లూరి జిల్లా నాయకులు అరగంటి వీరభద్రారెడ్డి, కెచ్చెల అబ్బాయిరెడ్డి, మడకం ప్రమీలరాణి, గిడుతూరి చిన్నారావు, ఏలూరు జిల్లా నాయకులు మిడియం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


మెగా డీఎస్సీ ప్రకటనపై హర్షం



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి పేదల విద్యకు భరోసా ఇచ్చారని ఆనందం వ్యక్తంచేస్తూ బీసీ, ఎస్సీఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తిలక్‌రోడ్డులో ఉన్న సంఘం కార్యాలయంలో సోమవారం గౌరవ అధ్యక్షుడు కెకె సంజీవరావు, వైస్ ఛైర్మన్ ఎల్‌వీ.ప్రసాద్, ఉపాధ్యక్షుడు గుత్తుల సుబ్రహ్మణ్యం, సభ్యులు మేడిశెట్టి తాతాబ్బాయి, బత్తిన ఏడుకొండలు, కోన లాజర్, నక్కా వెంకటరత్నం కేక్ కట్ చేసి వేడుక చేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 18 జూన్ 2024 | 5



పోలవరం చూసి.. కలవరం



డయాఫ్రం వాల్‌ను పరిశీలిస్తున్న బాబు

వ్యూ పాయింట్ నుంచి పోలవరం ప్రాజెక్టు పరిశీలిస్తున్న చంద్రబాబు

- పోలవరాన చంద్రబాబు పర్యటన
- గంటన్నర సేపు అణువణువు పరిశీలన
- ఎండలోనే కలియతిరిగిన వైనం
- నిర్మాణంపై అధికారుల నుంచి ఆరా
- ప్రాజెక్టు ప్రాంతం చూసి ఆవేదన
- జగన్ పాలనలో ధ్వంసం
- మళ్లీ మొదటికొచ్చిందని బాధ
- ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి

రాజమహేంద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కళ తప్పిన పోలవరం ప్రాజెక్టు పనులు చూసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివ్వెరపోయారు. 2019కు ముందు సీఎంగా చంద్రబాబు వచ్చినప్పుడు నిత్యం పనులు జరుగుతుండేవి.. ప్రాజెక్టు ప్రాంతం యంత్రాలు.. భారీ వాహనాలతో కళకళలాడేది.. ఎటు చూసినా వేలాది మంది కార్మికులు పని చేసేవారు. ప్రాజెక్టు చూడడానికి వేలాదిగా ప్రజలు వచ్చేవారు.. నాడు పోలవరం ప్రాజెక్టు ఒక పర్యాటక ప్రాంతంగా మారిందనడంలో ఎంత మాత్రం అతిశయోక్తిలేదు. ప్రతి ఒక్కరి నోటా పోలవరం ఎంత వరకూ వచ్చిందో అనే మాట వినిపించేది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇది ధ్వంసమైంది. యంత్రాలు లేవు. ఏదో కొద్ది లారీలతో ఇసుక తరలింపు తప్ప ఇంకేమీ పనులు సాగకపోవడంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆశ్చర్యపోయారు..నా మానసపుత్రిక పోలవరం ఇలా ఉందేమిటో అని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలస్థితిలో ఉన్న ప్రాజెక్టును చూసి నివ్వెరపోయారు.

అణువణువు పరిశీలన..

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు తొలిపర్యటనగా పోలవరం సందర్శించారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు హయాంలో సోమవారం..పోలవారం.. అంటూ ప్రతి వారం పర్యటిస్తూ పనులు పరుగులు పెట్టించారు. ఆ తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలవడంతో వైసీపీ చేతిక పగ్గాలు వచ్చాయి. అయితే జగన్ మాత్రం పోలవరం ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో 72 శాతం పనులు పూర్తవ్వగా నేడు అదే స్థితిలో ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం కావడంతో సోమవారం.. పోలవారంగా మార్చారు. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి నేరుగా కార్వాన్ బస్‌లో స్పిల్‌వే మీదకు వచ్చారు. స్పిల్‌వే బ్లాక్ 26వ వద్ద పనుల ప్రగతిపై అధికారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరావు, ఇతర అధికారులు అక్కడి పరిస్థితిని వివరించారు. చంద్రబాబు అధికారులను కొన్ని ప్రశ్నలు వేయడంతో పాటు కొన్ని సూచనలు చేశారు. ఎగ్జిబిషన్‌లో ఫొటోలను పరిశీలించి ఆరా తీశారు. ఒంటి గంటకు గైడ్‌బండ్ గ్యాప్-3, యుఎస్‌సీడీ, గ్యాప్ -1,2, డీఎస్‌ఈడీ వద్ద బస్ దిగి పరిశీలించి, ఇరిగేషన్ ఇంజనీర్ల నుంచి పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఎగువ కాఫర్‌డ్యామ్‌కు చేరుకుని సీపేజీల గురించి ప్రశ్నించారు. పవర్‌హౌస్ దిగువ భాగం నుంచి డయాఫ్రంవాల్ నిర్మించిన ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని అక్కడ పరిస్థితిని పరిశీలించారు. అధిక వర్షాలకు నాలుగుచోట్ల దెబ్బతిన్నట్టు అధికారులు వివరించారు. అక్కడ దిగువ కాఫర్ సమీపంలోకి వచ్చి వాటిని పరిశీలించి పవర్ హౌస్ పనులు చూసి సుమారు 2 గంటల ప్రాంతానికి తిరిగి పోలవరం స్పిల్‌వే ఎగువభాగంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయన వెంట ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత,మంత్రులు కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్,ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప,మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు,బత్తుల బలరామకృష్ణ, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మ రాజు, బొలిశెట్టి శ్రీనివాస్,చిర్రి బాలరాజు, బడేటి చంటి, ఏలూరు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్,ఎస్పీ డి.మేరీ ప్రశాంతి,జేసీ బి.లావణ్య, ఆర్డీవో అద్దయ్య తదితరులు ఉన్నారు.



పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి జవహర్ తదితరులు

పోలవరం ఇక వేగవంతం : దుర్గేష్

నిడదవోలు, జూన్ 17 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారాన్ని పోలవారంగా మార్చుకున్నారని గతంలో కూడా సోమవారం పోలవారంగా మార్చుకుని ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేశారని..అయితే గత ముఖ్యమంత్రి శుక్రవారాన్ని తన వారంగా మార్చుకున్నారని ఇది ఎందుకో అందరికి తెలిసిందే అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌ల సంయుక్త కృషితో పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తారన్నారు.



బాబుకు దుర్గేష్, బత్తుల స్వాగతం

పోలవరాన్ని జగన్ ధ్వంసం చేశాడు : చంద్రబాబు

పోలవరం జీవనాడి.. దీనిని జగన్ ధ్వంసం చేశా డన్నారు.తాను 72 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టును ఎన్ని విధాలా సంక్లిష్టం చేయవచ్చో అన్ని విధాలా చేసి పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ మాదిరిగా ఏజన్సీని మార్చేయడం, కమిటీలు వేసి తప్పులు వెతకడం కంటే ముందు ప్రాజెక్టును ఎలా పూర్తి చేయాలనేది ముఖ్యమన్నారు. జగన్‌కు అవగాహనలేక, మూర్ఖంగా ఉండడం వల్ల గతంలో ఏజెన్సీని మార్చడంతో పాటు రివర్స్ టెండర్ అంటూ ప్రాజెక్టును పనికి రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది చైనాలోని త్రీగోర్జెస్ కన్నా అధిక స్థాయిలో నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇక్కడ 194 టీఎంసీల నీరు నిల్వ చేయవ చ్చని, 320 టీఎంసీల వరకూ వరదనీటిని వినియోగించు కోవచ్చన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయా ఫ్రంవాల్‌ను నిర్మించామని కానీ 2019, 20లో భారీ వర్షాల కారణంగా నాలుగు చోట్ల దెబ్బతిందన్నారు. దీని మరమ్మతులకు రూ.447 కోట్లు ఖర్చవుతుందని.. పూర్తిగా మరమ్మతులు అవుతాయనే భరోసా లేదన్నారు. ప్రత్యామ్నాయంగా డయాఫ్రంవాల్ నిర్మించడానికి రూ.996 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేసినట్టు చెప్పారు.దీనికి కనీసం నాలుగు సీజన్లు పడుతుందని, 2022కే పూర్తి కావలసిన ప్రాజెక్టు మరింత ఆలస్యమవుతుందన్నా రు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం రా ష్ట్రానికి శాపంగా మారిందన్నారు. ఇవన్నీ చూసి అర్థం చేసుకున్నానని ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.



పోలవరం ప్రాజెక్టు చెంతకు వస్తున్న చంద్రబాబు కాన్వాయ్

వరుణదేవా.. కరుణలేదా!

- ఊరించి..ఉసూరుమనిపించిన వానలు
- ఉక్కబోత తట్టుకోలేక తల్లడిల్లుతున్న జనం
- రాజమహేంద్రవరంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 17 : అవిగో రుతుపవనాలు వచ్చేశాయి ... ఇక వర్షాలే వర్షాలు.. భూమి చల్లబడినట్టే అంటూ జరుగుతున్న ఊకదంపుడు ప్రచారం ఎండమావిని తలపిస్తున్నాయి. ప్రతిరోజూ తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ రాజమహేంద్రవరం ప్రజలు కళ్లు కాయలు కాసేలా ఆకాశంవైపు ఎదురు చూస్తున్నా ఒక్క వానచినుకు రాలడంలేదు. భూమి చల్లబడడంలేదు. దీంతో రాజమహేంద్రవరం సిటీ, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన ఉష్ణోగ్రతలు, ఉక్కబోతతో తల్లడిల్లిపోతున్నారు. గత కొద్దిరోజులుగా ఇదే తరహా మబ్బు వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. సోమవారం కూడా ఇలాంటి వాతావరణ అనుభవాన్నే ప్రజలు చవిచూశారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. గాలి దుమ్ము రేగింది. ఇదంతా కేవలం పది, పదిహేను నిమిషాలకే పరిమితమైంది. ఆ తర్వాత వాతావరణం మళ్లీ మామూలుగా మారిపోయింది. కాస్త ఉక్కబోత తగ్గినా వేడిమాత్రం చల్లారలేదు. గుబులు రేపుతోంది.. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. వ్యాపారులు దుకాణాలు మూసివేస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా ఒక మోస్తరు వర్షం కురిసినా రాజమహేంద్రవరం నగరంలో మాత్రం ఒక్క వానచుక్క కూడా పడడంలేదు. దీంతో నగరవాసులు రోజంతా వేడి వాతావరణంలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాత్రి సమయంలోనూ వాతావరణం చల్లబడకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో ఏసీలకు పనిచెబుతున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు,వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఉక్కబోతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. రాబోయే రోజుల్లోనూ వాతావరణ పరిస్థితులు ఇలానే కొనసాగితే ఎలా అంటూ ప్రజలు భయపడుతున్నారు.



కొవ్వూరులో వానకు తడిచిన రోడ్డు

మండలాల్లో మోస్తరుగా..

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: జిల్లాలో గడచిన 36 గంటల్లో అత్యధికంగా కోరుకొండ మండలంతో అత్యధిక వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ శాఖ తెలియజేసింది. జిల్లాలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కోరుకొండలో 40.0 మి.మీ, అత్యల్పంగా కొవ్వూరు డివిజన్ నిడదవోలులో 1.0 మిమీ వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం డివిజన్ అనపర్తిలో 4.2 మిమీ, గోకవరంలో 1.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 2.6 మి.మీ, సీతానగరంలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కోరుకొండ మండలంలో పిడుగులు పడి రెండు చూడిగేదెలు మరణించాయి..మిగిలిన మండలాల్లో వాతావరణం పొడిగాను, మబ్బుగాను ఉంది. కొవ్వూరు డివిజన్‌లో చాగల్లులో 23.6 మి.మీ, దేవరపల్లిలో 15.8 మి.మీ, గోపాలపురంలో 33.6 మి.మీ, కొవ్వూరులో 15.2 మి.మీ, నల్లజర్లలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

సర్కారు సొమ్ముతో షో..కులు!



ఎవరికోసం ఈ రోడ్డు : ఉపాధి నిధులు రూ.3.5 కోట్లతో పిడింగొయ్యిలో ఒక లేఅవుట్‌లో గత పాలకులు వేసిన రోడ్డు

ఉపాధి నిధులతో ప్రైవేటు లేఅవుట్‌కు రోడ్డు

- ఉపాధి నిధులు పక్కదారి
- రూ.3.50 కోట్ల వ్యయం
- నాటి మంత్రి ఆదేశాలతో పనులు?
- పిడింగొయ్యిలో నిర్మాణం
- ఇదీ వైసీపీ పాలకుల దాష్టీకం
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 17 : అంతా మా ఇష్టం..అడిగేదెవడ్రా అంతా మా ఇష్టం.. ఐదేళ్లూ ఇదీ వైసీపీ నాయకుల తీరు.. అధికార పార్టీలో ఒకరో ఇద్దరో తేడాగా ఉంటారు.. అయితే వైసీపీలో మాత్రం అందరూ తేడానే.. దీంతో ఆ పార్టీ అధికారంలో ఉన్నంత సేపూ ఎవరూ మాట్లాడేవారుకాదు.. దీంతో వారిని నచ్చిన చోట.. మెప్పించిన వారి కోసం రోడ్లు వేసేవారు..ఈ కథనమే అందుకు ఉదాహరణ. సాధారణంగా జాతీయ ఉపాధి హామీ నిధులతో ప్రజల సౌకర్యార్థం రోడ్ల నిర్మాణాలు చేపడతారు.ఈ పనుల ద్వారా ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నది పథకం ఆశయం. రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో నిబంధనలు అతిక్రమించి కొంతమంది లేఅవుట్‌దారులు, వ్యాపారసంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా జనావాసం లేని ప్రాంతంలో సుమారు రూ.3.50 కోట్ల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. సార్వత్రికఎన్నికల ముందు మండలంలో రూ.100 కోట్ల నిధులతో రోడ్లు వేస్తున్నామంటూ జీవో తెచ్చి హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. అయితే ఒక్క పని కూడా ఆరంభించలేదు.లే అవు ట్‌దారులకు తప్ప ఎవరికి ఉపయోగపడని ఈ ఒక్క రోడ్డును మాత్రం హడావుడిగా పూర్తి చేశారు.

ఆ లేఅవుట్‌కి రోడ్డెందుకు?

రూరల్ మండలం పరిధిలో పిడింగొయ్యి, కాతేరు, తొర్రేడు, వెంకటనగరం హుకుంపేట, కాలమూరు, ధవళేశ్వరం, బొమ్మూరు, రాజవోలు తదితర గ్రామాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. అలాంటిది ఇన్నీ వదిలేసి లేఅవుట్, వ్యాపారస్థులు ఇచ్చే ముడుపులకు కక్కుర్తిపడి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ పలువురు విమర్శిస్తున్నారు. అటువంటిది రాజమహేంద్రవరంరూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో పిట్టలవారిచెరువు ప్రాంతంలో సుమారు రూ.3.50 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పిట్టలవారి చెరువునుంచి ఎస్‌ఈఆర్ కుమార్ లేవుట్ వరకు రూ. 50లక్షలు, అక్కడ నుంచి రామకృష్ణ గార్డెన్ వరకు రూ.50 లక్షలు,సూర్యనారాయణ లేఅవుట్ నుంచి పంచికర్ల కృష్ణ లేవుట్ వరకు రూ. 50 లక్షలు, రేలంగి చిన వెంకట్రావు సైట్ నుండి రఘుబాబు సైట్ వరకు అలా బిట్లుగా విభజించి లేవుట్‌కు ఏకంగా సీసీ రోడ్లు నిర్మించారు. ఒక పక్క ప్రజ లం తా నివసించే చాలా గ్రామాల్లో రోడ్లు లేక ఇబ్బం దిపడుతున్న ఘటనలెన్నో ఉన్నాయి.ఒక్కసారి కాతేరు..బొ మ్మూరు, రాజవోలు తదితర గ్రామాలకు వెళితే భారీ భవంతులు ఉంటాయి. రోడ్డే ఉండదు. అయితే ఈ లేఅవుట్‌పై నాయకుల కెందుకంత మోజో వారికే తెలియాలి. ఇదంతా కలెక్టరేట్ చెం తనే జరుగుతున్నా చూసీ చూడనట్టు వదిలేయ డం కొసమెరుపు.ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి జోక్యం చేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నాటి మంత్రి వేణు ఆదేశాలు..

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు జిల్లా ఉన్నతాదికారుల ఆదేశాలతో గ్రామసభలో తీర్మానం చేశాం.అప్పటి గ్రామ ప్రత్యేకాధికారి జానా సత్యనారాయణ సమక్షంలో 2024 ఫిబ్రవరి 1న తీర్మానం చేశాం.

రూప్‌చంద్, పిడింగొయ్యి కార్యదర్శి

అంతా పెద్దోళ్ల వ్యవహారం : ఎంపీడీవో

సంబంధిత రోడ్డు విషయమై రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా అదంతా పెద్ద వాళ్ల వ్యవహారం అంటూ తప్పించుకుంటున్నారు. డ్వామా పీడీ ముఖలింగం వివరణకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



రాజమండ్రి నమూనా రైల్వేస్టేషన్

రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణపై సమీక్ష

రాజమహేంద్రవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌ను రూ.250 కోట్ల అంచనా వ్యయంతో తీర్చిదిద్దనున్నట్టు రైల్వే శాఖ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు రీ-డవలప్‌మెంట్‌పై అధికారులతో సోమవారం సమీక్షించారు.అమృత్ భారత్‌లో భాగంగా అత్యాధునికంగా తీర్చిదిద్దే రైల్వేస్టేషన్ల జాబితాలో రాజమండ్రి కూడా ఉండడం తెలి సిందే.ఈ స్టేషన్‌ని రానున్న 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంచనాలు సిద్ధం చేశా రు. మెట్రో సిటీల్లో ఎయిర్‌పోర్టుల మాదిరిగా రైల్వే స్టేషన్ రూపు దిద్దుకోబోతోంది. వీటన్నిటిపై ఉన్నతాధికారులతో రైల్వే కేంద్ర మంత్రి చర్చించారు. దీంతో పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. రాజమండ్రి రైల్వేస్టేషన్ గతేడాది జూలై నెలలో ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకొంది. ప్రస్తుతం ప్రతి రోజూ 100 వరకూ రైళ్లు నడుస్తుండగా..10 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.

నేడు పీఎం కిసాన్ విడుదల

రూ.2 వేలు చొప్పున బ్యాంకుల్లో జమ

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 17: పీఎం కిసాన్ పథకం నిధులు మంగళవారం ప్రధానీ నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు.ఉత్తరప్రదేశ్‌లోని వారణసిలో మంగళవారం జరిగే కిసాన్ సమ్మేళన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 9.3 కోట్ల మంది రైతులకు సీఎం కిసాన్ పథకం 17వ విడత విడుదల చేస్తారన్నారు. జిల్లాలో 98,550 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున రూ.19.71 కోట్లు జమవుతాయన్నారు. రైతుల్లో ఈ పథకంపై అవగాహనకు జిల్లావ్యాప్తంగాసాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.దీని కోసం హెచ్‌టీటీపీఎస్://పీఎంఐఎన్‌డీఐఏవెబ్‌కాస్ట్.ఎన్ఐసీ.ఇన్/లో తిలకించవచ్చన్నారు. జిల్లాలో 107 ప్యాక్ సొసైటీల్లో ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.







భక్తిగా..బక్రీద్

ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.. సోమవారం ఉదయమే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. జిల్లాలో రాజమహేంద్రవరం, నిడదవోలు , కొవ్వూరు, ఉండ్రాజవరం, పెరవలి తదితర మండలాల్లో ముస్లింలు పండుగను జరుపుకున్నారు. నిడదవోలులోని ఒక మసీదులో సోమవారం మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రార్థనల్లో పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీకగా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది..మసీదులన్నీ ముస్లిం సోదరులతో కిటకిటలాడాయి.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

అపరాద రుసుం రద్దు చేయాలి

పొగాకుబోర్డు రైతు సంఘం నాయకుల వినతి



ఎంపీ పురందేశ్వరిని కలిసిన పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు

దేవరపల్లి, జూన్ 17: పొగాకు బోర్డులో పొగాకు అదనపు కోట అమ్మకాలపై అపరాద రుసుం రద్దు చేయాలని కోరుతూ దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డి గూడెం, కొయ్యలగూడెం, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయం వద్ద సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పొగాకు బోర్డు రైతుల సమస్యలను కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్తానని, వారం రోజుల్లో ఆయన అపాయింట్‌మెంట్ తీసుకుని రైతు లతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీ పురందేశ్వరి చెప్పారని పొగాకు రైతు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కరుటూరి శ్రీనివాస్, పరిమి రాంబాబు, వెంకటేశ్వర రావు, కాకర్ల నంది, విల్లూరి రాంబాబు, గద్దే శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

గడువు తీరకుండానే ఆలయ భూముల వేలం!

తాళ్లపూడి, జూన్ 17: మండలంలోని పెద్దేవం గ్రామంలోని ఛాయా సోమేశ్వరస్వామి, జనార్దనస్వామి ఆలయ భూముల వేలం అత్యవసరంగా నిర్వహించారని, 2022లో జరిగిన వేలంలో తనకు 2025 మార్చి వరకూ లీజు పర్మిషన్ ఇచ్చారని, ఇప్పుడు అత్యవసరంగా ఎండోమెంటు ఈవో దేవాలయ భూముల వేలం నిర్వహిస్తున్నారని తోట రామకృష్ణ ఆరోపించారు. గత రెండేళ్ల ఎటువంటి బకాయిలు లేకుండా దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం లీజు చెల్లించామని, తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎండోమెంటు ఈవోను సంప్రదించగా రామకృష్ణ వద్దకు పాత బకాయిల కోసం ఎన్నిమార్లు తాను, తమ సిబ్బంది వెళ్లి అడిగినా సరిగా కట్టనందున పాటను రద్దు చేసి నూతనంగా వేలం నిర్వహించామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో 2007-09 బ్యాచ్ బైపీసీ విద్యార్థులు

నల్లజర్ల, జూన్ 17: నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో 2007-09 సంవత్సరంలో ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం అదే కళాశాలలో జరిగింది. నాడు బోధించిన అధ్యాపకులతో కలిసి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం లెక్చరర్లు సోమయ్య, శ్రీనివాసరావు, ప్రసాద్, శాస్త్రీ, హనుమంతులను ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే మద్దిపాటిని కలిసిన డ్వాక్రా సీఏలు



నల్లజర్లలో ఎమ్మెల్యే మద్దిపాటికి శుభాకాంక్షలు చెబుతున్న డ్వాక్రా సీఏలు

నల్లజర్ల, జూన్ 17: నియోజకవర్గ డ్వాక్రా సీఏలు సోమవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నాలుగు మండలాలకు సంబంధించిన అధికారులు, వీఆర్వోలు, వైద్య సిబ్బంది, రాజకీయ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు.

రామన్నపాలెంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రవీణ్ వసంత్

దేవరపల్లి, జూన్ 17: మండలంలోని రామన్నపాలెం జడ్పీ హైస్కూల్లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-17 విభాగంలో 24 జట్లు, అండర్-14 విభాగంలో 16 జట్లు పాల్గొన్నాయి. అండర్-17లో అనంతపురం ప్రథమస్థానం, ఏలూరు ద్వితీయ స్థానం, నూజివీడు తృతీయస్థానంలో నిలిచాయని హెచ్‌ఎం పేరం రవీంద్రనాథ్ తెలిపారు. అండర్-14లో కాకినాడ ప్రథమ స్థానం, నూజివీడు ద్వితీయస్థానం, అనంతపురం తృతీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. విజేత జట్లకు బహుమతులను డైరెక్టర్ ప్రవీణ్ వసంత్ అందజేశారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు చెన్నైలోని వివేకానంద అండ్ గుడ్ సమారిటన్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా ఉచితంగా శిక్షణ, స్కాలర్‌షిప్ అందజేయనున్నట్టు ప్రవీణ్ వసంత్ తెలిపారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన కూటమి నాయకులు



పెరవలి, జూన్ 17: రాజమండ్రి ఎంపీగా ఘన విజయం సాధించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సోమవారం మండలంలోని పలువురు కూటమి నాయకులు కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సింహాద్రి సత్యనారాయణ, కంటిపూడి సూర్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, బోగవల్లి చంటిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పెరవలి, జూన్ 17: కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సోమవారం పరామర్శించారు. ఖండవల్లిలో మొల్లేటి సత్యనారాయణ, అన్నవరప్పాడులో మీసాల ఈశ్వరరావు కుటుంబీకులను కలిసి ఓదార్చారు. అలాగే నల్లాకుల వారి పాలెంలో సోడాభక్తుల విజయరాజు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. అర్హులైన వారికి తమ రవళి స్పిన్నింగ్ మిల్లులో ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఉపసర్పంచ్ అతికాల శ్రీను, రెడ్డి సత్యనారాయణ, నల్లాకుల వెంకటేశ్వరరావు, కోపెళ్ల చినబాబు, కోలా సీతయ్యనాయుడు పాల్గొన్నారు.





సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి



పోలవరం సందర్శనకు కాన్వాయ్‌తో వస్తున్న సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



చంద్రబాబుకు నమస్కరిస్తున్న బూరుగుపల్లి

కొవ్వూరు/గోపాలపురం/నిడదవోలు, జూన్ 17: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు సోమవారం వచ్చారు. మధ్యాహ్నం సుమారు 12గంటలకు ప్రాజెక్టు వద్దకు వచ్చిన ఆయనకు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అక్కడి నుంచి నేరుగా కార్వాన్‌లో స్పిల్‌వే మీదకు వచ్చారు. డయాఫ్రం వాల్, కాపర్ డ్యాం, తర్వాత 1గంటకు గైడ్‌బండ్ గ్యాప్-3, యూఎస్‌సీడీ, గ్యాప్ -1,2, డీఎస్‌ఈడీ తదితర ప్రాంతాలను పరిశీలించారు. పనుల ప్రగతిపై అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన మొదలై 72శాతం పనులు పూర్తిచేసిన చంద్రబాబే మిగిలిన 28శాతం పూర్తి చేయదగిన నాయకుడని అన్నారు. శేషారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడం చంద్రబాబుతోనే సాధ్యమని, ఇక పనులు వేగవంతం కానున్నాయని అన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తున్న సీఎం చంద్రబాబు



ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కరాటం రాంబాబు



ప్రాజెక్టు వద్ద యంత్రాలతో పనిచేస్తున్న దృశ్యం



పోలవరం ప్రాజెక్టు ఏరియా



ప్రాజెక్టు ప్రగతిని మ్యాప్‌ల ద్వారా సీఎంకు వివరిస్తున్న అధికారులు

మాజీ ఎమ్మెల్యేలకు గన్‌మెన్లా!

▸ నిడదవోలు మాజీ ఎమ్మెల్యేతో ఇంకా ప్రభుత్వ గన్‌మెన్లు



నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు వెంట విధుల్లో ఉన్న గన్‌మెన్ (శ్రీనివాస్ నాయుడు వెనుక సఫారీ సూట్‌లో ఉండి బొట్టు పెట్టుకుని నుంచుని ఉన్న వ్యక్తి)

నిడదవోలు, జూన్ 17: కూటమి ప్రభుత్వంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేలకు ప్రభుత్వ గన్‌మెన్లను ఇస్తున్నట్టు ఉన్నారు.. లేకపోతే ఇదేంటి.. ఎన్నికలు ముగిసిపోయాయి.. కౌంటింగ్ పూర్తయిపోయింది.. ఎవరు ఎమ్మెల్యేలుగా గెలిచారో.. ఎవరు మాజీలుగా ఉన్నారో తేలిపోయింది. అయినా ఓటమి చెందిన ఎమ్మెల్యేలు ఇంకా గన్‌మెన్లను తమ వెంట తిప్పుకుంటున్నారు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. ఎక్కడైనా ఎమ్మెల్యే ఓటమి పాలైతే ప్రభుత్వం కల్పించిన భద్రత (గన్‌మెన్)ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు వారు వేచి ఉండరు. అయితే నిడదవోలుకు చెందిన మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు మాత్రం ఓడిపోయినా ప్రభుత్వ గన్‌మెన్లను మాత్రం తన వెంట తిప్పుకుంటూనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించ డంతో నాడు ఇద్దరు గన్‌మెన్లను వన్ ప్లస్ వన్ పద్ధతిలో ప్రభుత్వం నియ మించింది. ఇటీవల విడుదలైన 2024 ఫలితాల్లో ఆయన ఓటమి పాల య్యారు. అయినా ఇంకా తన వెంటే తిప్పుకుంటున్నారు. గన్‌మెన్లు సైతం ఆ మాజీకి సేవకులుగా మారిపోయారు. నిడదవోలు పట్టణ వైసీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు వెంట గన్‌మెన్ ఉండడం చూసి అంతా ఆశ్చర్యపోయారు. కూటమి ప్రభుత్వంలో కొత్తగా ఓడిపోయిన ఎమ్మెల్యేలకు గన్‌మెన్లను ఇస్తున్నారో ఏమిటో అంటూ గుసగుసలు వినిపించాయి.

బక్రీద్ ప్రేమకు ప్రతీక



కొవ్వూరులో మసీద్ నుంచి వస్తున్న ముస్లింలు

నిడదవోలు, జూన్ 17: బక్రీద్ పండుగ ప్రేమ, త్యాగానికి ప్రతీక అని ప్రపంచ శాంతికి నిదర్శనమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలులోని మసీదులో జరిగిన బక్రీద్ సామూహిక ప్రార్థనల్లో ముస్లింలతో కలసి మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ మార్చి 12న రంజాన్ మాసం ప్రారంభం రోజున నిడదవోలు నియోజకవర్గానికి వచ్చానని, తన జీవితంలో మార్పుకు నాంది పలికింద న్నారు. ఒకప్పుడు నవాబులుగా ఉన్నవారు ఇప్పుడు గరీబులుగా అయిపోయా రని, ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు చర్యలు తీసుకొంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా శేషారావు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, జనసేన అధ్యక్షుడు రంగా రమేష్, తిరుపతి సత్యనారాయణ, బెల్లంకొండ పుష్పావతి, ముతవల్లీలు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులోని జామియా మసీదు, సత్యవతినగర్‌లోని మర్కజ్ మసీదుల్లో ఇమామ్‌లు ప్రార్థనలు నిర్వహించి, బక్రీద్ సందేశాన్ని అందించారు. అల్లాహ్ ఆదేశాల ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్‌ని బలి ఇవ్వడానికి తీసుకువెళ్లే సాంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు బక్రీద్‌ను జరుపుకుంటారన్నారు. పేదలకు కానుకలు సమర్పించారు.

వైసీపీని నాశనం చేశావ్.. రాజీనామా చెయ్

▸ నగర అధ్యక్షుడు శ్రీహరిపై ఆ పార్టీ నేత బర్రే ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: రాజమహేంద్రవరంలో వైసీపీని నాశనం చేశాడని, పార్టీ నగర అధ్యక్ష పదవి అడపా శ్రీహరిపై అదే పార్టీకి చెందిన బర్రే కొండబాబు ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వైసీపీ వార్డు ఇన్‌చార్జీల సమావేశంలో.. రాజమహేంద్రవరంలో భరత్‌రామ్‌కు 30 వేలు మెజార్టీ రాకపోతే తక్షణమే తాను రాజీనామా చేస్తానని, చాలా గొప్పగా అందరిలో ప్రకటించిన శ్రీహరి నగరంలో వైసీపీ ఓడిపోయినా ఇంతవరకు రాజీనామా చేయలేదన్నారు. అనుభవం లేదు, విలువల్లేవు, ఆచరణలేని వ్యక్తి అడపా శ్రీహరి అని, ఏ వార్డులోనూ ఇన్‌చార్జిలకు పట్టులేకుండా చేశారని ధ్వజమెత్తారు. గతంలో పార్టీ నగర అధ్యక్షులుగా చేసిన వారు పని చేశారని, భ్రష్టు పట్టించలేదన్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీని బలోపేతం చేయలేకపోయారు. ఇప్పుడేమి చేయగలని ప్రశ్నించారు. అతను రాజీనామా చేయకపోతే తాము ప్రణాళిక సిద్ధం చేసుకుంటామని కొండబాబు అన్నారు. దీంతో పార్టీలో అంతర్గత పోరు ఒక్కసారిగా బయట పడింది.

మెగా డీఎస్సీ ప్రకటనపై హర్షం



వేడుక చేసుకుంటున్న బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సంఘం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి పేదల విద్యకు భరోసా ఇచ్చారని ఆనందం వ్యక్తంచేస్తూ బీసీ, ఎస్సీఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తిలక్‌రోడ్డులో ఉన్న సంఘం కార్యాలయంలో సోమవారం గౌరవ అధ్యక్షుడు కెకె సంజీవరావు, వైస్ చైర్మన్ ఎల్‌వీప్రసాద్, ఉపాధ్యక్షుడు గుత్తుల సుబ్రహ్మణ్యం, సభ్యులు మేడిశెట్టి తాతాబ్బాయి, బత్తిన ఏడు కొండలు, కోన లాజర్, నక్కా వెంకటరత్నం కేక్ కట్ చేసి వేడుక చేశారు.

మీ సేవ కేంద్రాలకు పూర్వవైభవం తీసుకురండి

ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డిలకు నిర్వాహకుల వినతి



ఎంపీ పురందేశ్వరిని కలిసి సమస్యను విన్నవిస్తున్న మీ సేవ నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: గత వైసీపీ ప్రభుత్వం మీసేవల పట్ల అనుసరించిన విధానాలతో తాము పూర్తిగా నష్టాల్లోకి కూరుకుపోయామని ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో మీసేవ కేంద్రాలు నడపలేని స్థితిలో ఉన్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌లను సోమవారం కలిసి తమ గోడును చెప్పుకున్నారు. మీసేవ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం హయాంలో పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు తప్పక న్యాయం చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

కడియం, జూన్ 17: బక్రీద్ పండుగను మండలంలో ఘనంగా నిర్వహించారు. కడియం, దుళ్ల, వేమగిరి, పొట్టిలంక తదితర గ్రామాల మస్‌జిద్‌లలో ఇమామ్‌లు బక్రీద్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో ముస్లింలు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేస్తున్న టీడీపీ

పార్టీ యాదవ సాధికార సమితి జిల్లా కన్వీనర్

దివాన్‌చెరువు, జూన్ 17: రాష్ట్రంలో కీలకమైన పదవులను కేటాయించడంలో సీఎం చంద్రబాబు బీసీలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు) అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్‌లోని 24 మందిలో ఎనిమిది మంత్రి పదవులు బీసీలకు దక్కగా, తాజాగా టీడీపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కుడా వెనుకబడిన తరగతులకు చెందిన పల్లా శ్రీనివాసరావును నియమించారన్నారు. ఎన్నికలకు ముందు బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆమేరకు కీలకపదవులను బీసీలకు కేటాయిస్తున్నారంటూ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1,20,000 కోట్లు కేటాయించాలి

ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు



సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 17: పోలవరానికి కేంద్ర ప్రభుత్వం లక్షా 20 వేల కోట్లు కేటాయించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం 1,70,000 ఎకరాలకు రూ.36 లక్షలు చొప్పున నష్టపరిహారంగా రూ.61 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఇంకా 93 వేల కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తిచేసిన తర్వాత మాత్రమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులకు ఈమెయిల్ ద్వారా లేఖలు పంపించినట్టు చెప్పారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ అల్లూరి జిల్లా నాయకులు అరగంటి వీరభద్రారెడ్డి, కెచ్చెల అబ్బాయిరెడ్డి, మడకం ప్రమీలరాణి, గిడుతూరి చిన్నారావు, ఏలూరు జిల్లా నాయకులు మిడియం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న పవన్ అభిమాని



ద్వారకాతిరుమల, జూలై 17: జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్ భారీ మెజారిటీతో గెలవడంతో ఓ అభిమాని మోకాళ్లతో శ్రీవారి మెట్లు ఎక్కి మొక్కు తీర్చుకున్నాడు. పెరవలి మండలం నడుపల్లెకు చెందిన పువ్వుల సత్తిబాబు పవన్ అభిమాని. ఈ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్‌లు గెలిస్తే తన కుటుంబంతో కలసి కాలినడకన ద్వారకాతిరుమల వచ్చి స్వామి వారిని దర్శిస్తానని మొక్కుకున్నాడు. సోమవారం మోకాళ్లపై మెట్లు ఎక్కి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నాడు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మనమే
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---